కథ

# మరణభృతి




తాటికోల పద్మావతి

పడకకుర్చీలో పడుకుని ఒకటే దగ్గుతున్నారు ప్రకాశం. రాజ్యలక్ష్మి గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చింది. అలా దగ్గకపోతే ఏవైనా మందులు వేసుకోవచ్చు గదా ! "ఉంటే ఎందుకు వేసుకోగూడదు. మందులైపోయి రెండు రోజులైంది. అబ్బాయితో చెప్పలేకపోయారా!

నిన్న ఆఫీసుకు వెళ్తుంటే చెప్పాను. సాయంత్రం వచ్చేటప్పుడు తెస్తాలే అన్నాడు. వాడికెన్ని పనులో. ఏం గుర్తుంటుంది. ఈరోజన్నా తెస్తాడేమో చూద్దాం ! అడిగో మాటల్లోనే రానే వచ్చాడు ! చంద్రం, నిన్న దగ్గుమందులు తెమ్మన్నాను తెచ్చావా !

మరిచిపోయాను నాన్నా ! ఉండు ఇపుడే వెళ్ళి తెస్తానంటూ ట్యాబ్‌లెట్స్, టానిక్ అన్నీ తెచ్చాడు. అలాగే వచ్చేటపుడు కొన్ని పండ్లు కూడా కొన్నాడు. చంద్రం ఇంట్లోకి రాగానే చేతిలో ఉన్న పండ్ల బుట్ట అందుకొని లోపలికి తీసుకొని వెళ్ళింది భార్య కమల.

నాన్నా ఇవిగో మందులు, భోజనం చేశాక వేసుకో ! అమ్మా నీకు బలానికి టానిక్ తెచ్చాను. ప్రతిరోజూ భోజనం చేశాక రెండు చెంచాలు నీళ్ళలో కలుపుకొని తాగు !

నాకెందుకురా అబ్బాయి ! నేను బాగానే ఉన్నాను. మీ నాన్న రోజు రోజుకు దగ్గు ఎక్కువై బాధ పడుతున్నాడు.

ఒకసారి హాస్పటల్‌కి తీసికెళదాంలే ! ప్రస్తుతానికి ఆ మందులు వాడండి !

ఆ మంచినీళ్ళు ఇలా ఇవ్వు. మాత్ర వేసు కొంటానన్నాడు ప్రకాశం. రాజ్యలక్ష్మి మంచినీళ్ళతో పాటుగా మాత్ర కూడా అందించింది.

అంతా భోజనాలదగ్గర కూర్చున్నారు. రాజ్యలక్ష్మి వడ్డిస్తున్నది. అమ్మా నువ్వు కూర్చో! కమల వడ్డిస్తుందిలే అన్నాడు.

ఫరవాలేదులే ముందు మీరు తినండి. మీకు మజ్జిగ పోసి నేను కూర్చుంటానంది. అందరి భోజనాలైనాయి. చివరిగా రాజ్యలక్ష్మి మజ్జిగన్నం తిని లేచింది. రాత్రిపూట ఎక్కువ తింటే అరగటం లేదని తక్కువగా తింటున్నది. దానివల్ల తెల్లవారగానే నీరసం.

యాపిల్ పండుకోసి ప్లేటులో ముక్కలు పెట్టి భర్తకి అందించింది కమల. ఇవి అమ్మా నాన్న కోసం తెచ్చాను. వాళ్ళకి పెట్టు నాకు వద్దులే అన్నాడు. కష్టపడి సంపాదించేది మీరు. మీరు తినకుండా వాళ్ళకి ఎందుకు పెట్టటం ? "వాళ్ళు పెద్దవాళ్ళు. ముందుగా వాళ్ళకి పెట్టాలి. మనం ఎప్పుడైనా తినచ్చు. ఈ వయసులో వాళ్ళేమన్నా కష్టపడాలా. ఊరికే తిని కూర్చోవటమేగా. మందులకోసం రెండొందలు ఖర్చుపెట్టారు. అవి చాలవన్నట్లు పళ్ళు కూడా తెచ్చారు. అడగకుండానే మీ వాళ్ళకోసం డబ్బులు ఖర్చుపెడతారు. మొన్న సరదాగా సినిమాకి వెళదాం అంటే ఇంట్లో టీవిలో చూడచ్చు. ఎందుకు డబ్బు దండగా అంటూ ఉపన్యాసం దంచారు. పిల్లలు సరదాగా వెళదామన్నా పార్కుకి కూడా తీసికెళ్ళరు. పిల్లల్ని వెంట తీసుకెళితే వాళ్ళు అడిగినవన్నీ కొనిపెట్టాల్సి వస్తుందని మీ బాధ. మీకు భార్య పిల్లలు ఉన్నారన్న సంగతే మరచిపోతున్నారు. ఎంతసేపటికి మీ తల్లిదండ్రులకి ఎంతయినా ఖర్చుపెడతారంటూ కోపంతో యాపిల్ ముక్కలు దూరంగా విసిరేసి మంచంమీద పిల్లల పక్కన పడుకొంది.

"ఎలా చెబితే నీకు అర్థమవుతుంది. వాళ్ళు బ్రతికినన్నాళ్ళు బ్రతికారు. ఈ వయసులో వాళ్ళకి ఏమైనా తినాలని ఉంటుంది. మనమే అర్థం చేసుకోవాలి.

వాళ్ళకి అంతగా తినాలని ఉంటే వాళ్ళ దగ్గరున్న డబ్బులతో కొనుక్కోమనండి. ఉన్నదంతా వాళ్ళకోసం ఖర్చుపెట్టి రేపు నాకు నా పిల్లలకు ఏమీ లేకుండా చేస్తారు. మీకేమన్నా పదివేలు జీతం ఉందా. ఏమన్నా గవర్నమెంటు ఉద్యోగం చేస్తున్నారా!

తల్లిదండ్రుల్ని పోషించడానికి గవర్నమెంటు ఉద్యోగం చేయక్కరలేదు. అడుక్కొచ్చి పెట్టయినా తల్లిదండ్రుల ఋణం తీర్చుకోవచ్చు !

"రేపు మీ నాన్నని చూడటానికి మీ చెల్లెలు వస్తున్నది. వీళ్ళకి పెట్టేది కాకుండా ఇంటికి వచ్చే పోయేవాళ్ళందరికీ ఎక్కడ నుంచి తెచ్చి పెడతాం. రెండు రోజులు భోజనమైతే పెట్టగలం. చీరలు సారెలంటూ పెట్టాలి. మనం పెట్టకపోయినా మీ అమ్మగారు ఊరుకొంటారా. నీ చెల్లెలు వచ్చింది, ఒక చీరకొని పెట్టలేవా అంటుంది. ఆ తర్వాత పిల్లలు. ఇలా అందరికీ పెట్టుకొంటూ పోతే రేపు మనం అడుక్కుతినాలి. ఇంకా ఎంతకాలం భరిం చాలో మీ వాళ్ళని. మీరొక్కరే కొడుకు కావటానికి మన ప్రాణానికొచ్చి పడింది.

కమలా ! ఏమిటామాటలు. చిన్నా పెద్దా లేకుండా నా తల్లిదండ్రులు నాకేం బరువు కాదు. కావాలంటే రాత్రిపూట కూడా ఏదో పనిచేసి డబ్బు సంపాదిస్తాను.

"ఇప్పటికే అలసిపోయానంటారు. ఇంక రాత్రిళ్ళు కూడా చేసి ఆరోగ్యం పాడు చేసుకోండి. పిల్లల్ని చదువు మాన్పించి పనిలో పెట్టాలి.

అబ్బబ్బ, ఎందుకే అంతంత మాటలం టావు. ఇంత మాత్రానికే నా ఆరోగ్యం ఏమీ చెడి పోదు. మీరేం కష్టపడనవసరం లేదు. నా బాధేదో నేనే పడతానంటూ దుప్పటి ముసుగుపెట్టి పడు కొన్నాడు.

తెల్లవారి లేచింది మొదలు రాత్రి పడుకో బోయే దాకా నడుం విరిగేలా చాకిరి చేస్తుంది రాజ్యలక్ష్మి. కమల పిల్లల్ని స్కూలుకి పంపటం, తీసుకురావటం పైపైన పెత్తనం చెలాయిస్తుంది.

రాత్రి సరిగా నిద్ర పట్టక తెల్లవారి ఏడు గంటలైనా మెలకువరాలేదు రాజ్యలక్ష్మికి. ప్రకాశం గారు తొందరగా లేచి ముఖం కడుక్కొని కాఫీకోసం ఎదురు చూస్తున్నారు.

కమలా ! లేచి కాఫీ కలుపు. అమ్మ ఇంకా లేవలేదు. అలసిపోయి ఉంటుంది. అందుకనే పడుకొంది.

"అంటే నేను మాత్రం ఇంట్లో ఊరికే కూర్చుని తింటున్నానా ! పనేం చేయటం లేదా ! నాకూ బాగా లేదు. నేనూ లేవలేను. ఈరోజు ఆదివారమేగా పిల్లలకి కూడా సెలవే. ఇంతపొద్దున్నే కాఫీ తాగకపోతే ప్రమాదం ఏమీ జరగదు. అంతగా కావాలంటే మీరే కాఫీ కలిపి ఇవ్వండి. నేను ఇపుడే లేవనంటూ మంచం దిగలేదు. ఇటు తల్లి దండ్రుల్ని సుఖపెట్టలేక భార్యచేత మాటలు పడుతూ మన శ్శాంతి లేదు చంద్రంకి. కొడుకుగా తనభాధ్యతల్ని నెరవేర్చుకో లేకపోతున్నందుకు మనసులో చాలా బాధగా ఉంది. ఏమన్నా అంటే కమల రాద్ధాంతం చేస్తుంది. భోజనం చేయకుండా అలిగి కూర్చుంటుంది. ఇంట్లో నరకం. ఎందుకులే అనుకొంటూ తానే లేచి పాలు కాచి కాఫీ కలిపి ఇచ్చాడు తండ్రికి.

మీ అమ్మ ఎందుకో లేవలేదురా ఒకసారి చూడమన్నాడు !

చంద్రం తల్లి మంచందగ్గరగా వచ్చి దుప్పటి పైకి తీసి చూశాడు. నుదుటి మీద చెయ్యి పెట్టి చూడగానే ఒళ్ళు కాలిపోతున్నది. నూటమూడు జ్వరం ఉంది. అమ్మా లేచి ముఖం కడుక్కో కొంచెం

## మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్

ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన బాంబును రష్యా తయారుచేసి పరీక్షించింది. పీడన శక్తితో పనిచేసే ఈ థర్మోబార్మిక్ బాంబు ప్రస్తుతం అమెరికా దగ్గరున్న అత్యంత శక్తివంతమైన బాంబు 'మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్' (మోయబ్) కంటే నాలుగురెట్లు శక్తివంతమైనదని రష్యా సైనికాధికారులు పేర్కొన్నారు.

పాలు తాగి పడుకొందువు గానంటూ తల్లిని దగ్గ రుండి లేపించి ముఖం కడుక్కొన్నాక పాలు కలిపి ఇచ్చాడు. సాయంత్రం దాకా చూసి తగ్గకపోతే హాస్పిటల్‌కి తీసుకెళదాంలే అన్నాడు.

విసుక్కొంటూ ఆ పూటకి కమలే వంట చేసింది. ఆ సాయంత్రమే చంద్రం చెల్లెలు రోహిణి పిల్లల్ని తీసుకొని వచ్చింది.

అమ్మా ఎలా ఉన్నావు ? ఏమిటి ? జ్వరమా! ఎప్పటినుంచి, హాస్పటల్‌కి వెళ్ళలేదా. మిమ్మల్ని చూడా లని నా మనసు ఎంతగానో కొట్టుకు పోతున్నది. పిల్లలకి సెలవులు లేక రాలేకపోయాను.


మీ అమ్మా నాన్నని అంతగా చూడాలని ఉంటే తీసికెళ్ళి నీ దగ్గరే ఉంచుకోలేకపోయావా. మీ అన్నయ్యని కన్నట్లు నిన్నూ కన్నారు. నీకూ తల్లి దండ్రుల్ని చూసే బాధ్యత ఉంది. వచ్చినదానివి ఎటూ నీతో పాటు తీసుకొనిపో. మాకూ కొన్నాళ్ళు స్వేచ్ఛగా ఉంటుంది అంది కమల.

కోడలి మాటలు వింటున్న ప్రకాశం గారు నోరు వెళ్ళబెట్టారు. చివరివరకూ కొడుకు దగ్గరే ఉండాలనుకొన్నారు. ఆడపిల్లకు బరువవుతారా. కూతురు అత్తవారింట్లో ఉన్నపుడు వాళ్ళదగ్గరికివెళ్ళి ఎలా ఉండగలం. వీళ్ళకిపుడు మేం భారమైనామా అనుకొని కళ్ళు వత్తుకొన్నారు.

చంద్రం ఏమీ మాట్లాడలేక లోపలికి వెళ్ళి పోయారు. రోహిణి తల్లిదండ్రుల దుస్థితి చూసి చాలా బాధపడింది. ఏం అంటే ఏం గొడవలొస్తాయోనని ఏమీ మాట్లాడలేదు. సాయంత్రం దాకా వుండి ఏవైనా కొనుక్కోమంటూ నాలుగొందలు తల్లిచేతిలో పెట్టి వెళ్ళింది.

రాజ్యలక్ష్మికి తెల్లవారినా జ్వరం తగ్గలేదు. ఇంకా ఏం మీ చెల్లెలు నాలుగొందలు ఇచ్చి వెళ్ళిందిగా. ఆ డబ్బులు మీ అమ్మదగ్గరే ఉన్నాయి. వాటితో ఈ సారికి మందులు కొనండి. ప్రతిసారీ మీకు మాత్రం ఎక్కడినుంచి వస్తాయి. రేపు మన శ్యాం పుట్టినరోజు. వాడికి మంచి డ్రస్ కొనాలి. ఎప్పటినుంచో జీన్స్ ఫ్యాంటు కావాలని గొడవ చేస్తున్నాడంది కమల.

చంద్రం తల్లిని హాస్పిటల్‌కి తీసుకెళ్ళి చూపించాడు. అది మామూలు జ్వరం కాదు టైఫాయిడ్ అన్నారు. ఆరోజు టెస్టులన్నిటికీ కలిపి, మందులతో సహా వెయ్యిరూపాయల దాకా అయి నాయి. రాజ్యలక్ష్మి మంచంలో నుంచి లేవకపోయే సరికి ఇంటి పనిభారమంతా కమలమీద పడింది. చీటికి మాటికి విసుక్కోవడం అయినదానికి కాని




దానికి కోపంతో భర్తమీద అరవటం ఒక్కోసారి పిల్లల్ని బాదటం చేస్తున్నది.

పుట్టినరోజుకి కొడుక్కి బజారు తీసుకెళ్ళి మంచి డ్రస్ కొన్నాడు ! స్కూల్లో పిల్లలందరికీ చాక్లెట్లు పంచాలంది కమల. అందరికీ సరిపడా చాక్లెట్లు తెచ్చిచ్చాడు. తాతయ్యకి బామ్మకి కూడా చాక్లెట్లు ఇస్తుంటే రాజ్యలక్ష్మి మంచంలోనుంచి లేచి దిండు కింద పర్సులోనుంచి కూతురిచ్చిన నాలుగొందలు తీసి మనవడి చేతిలో పెట్టింది.

"అమ్మా బామ్మ నాకు డబ్బులిచ్చిందే అంటూ తల్లికి చెప్పాడు. అయితే మీరు నిన్న డాక్టర్ దగ్గర కెళ్ళేటప్పుడు ఆ డబ్బులు తీసుకోలేదా. మీ జేబులోవే వదిలించుకున్నారా ! అవే మన పిల్లాడి కిచ్చింది. ఇలా ఇవ్వమంటూ కమల తీసేసుకొంది. ఇది అన్యాయం అంటున్న భర్తమాట కూడా విని పించుకోలేదు.

మంచంలో ఉన్నప్పటినుంచీ రాజ్యలక్ష్మి పరిస్థితి అధ్వాన్నంగా మారింది. ప్రకాశంగారికి వేళకి సరైన తిండి లేదు. సమయానికి కాఫీ లేదు. ఏదో తప్పదన్నట్లు మధ్యాహ్నం అంత అన్నం పెడుతుంది కోడలు. ఉదయం టిఫిన్‌లు చేయటం అసలే మానే సింది. పెద్ద వయసు ఆకలికి అల్లాడిపోతున్నాడు.

ఉదయం పిల్లల్ని స్కూల్లో దింపటానికని వెళ్ళిన కమల ఎంతసేపటికి ఇంటికి రాలేదు. ఏమండీ అంటూ భర్తని పిలిచింది. నీరసంగా ఉందంది. ఇంట్లో ఎక్కడ వెతికినా పండ్లు గాని, గ్లూకోజ్ గాని కనిపించలేదు. జేబులో పైసా లేదు.

రాజ్యం ! నీకు భర్తనై ఉండి నేనేం చేయలేకపోతున్నాను. జ్వరంతో బాధపడుతుంటే మందులు కూడా ఇప్పించలేని స్థితిలో ఉన్నాను. బ్యాంకులో ఉన్న పదివేలు తీసి ఖర్చుపెడితే, రేపు మనిద్దరిలో ఎవరో ఒకరం పోయాక ఆ డబ్బు ఉపయోగపడుతుందని అలా ఉంచాను. కనీసం తల కొరివన్నా పెట్టటానికి ఖర్చులకి కావాలి గదా. నేనేమీ చేతగాని అసమర్థుడినంటూ కన్నీళ్ళతో బాధపడ్డారు.

"ఊరుకోండి ! మీరు మాత్రం ఏం చేయగలరు. జ్వరమేగా అదే తగ్గిపోతుంది. చేతిలో డబ్బుల్లేక చంద్రం బాధపడకూడదు. ఆ డబ్బుని అలాగే ఉండనీయండి" అంది .

ఆ జ్వరంతోనే మంచంలోనే ఒకరోజు కన్ను మూసింది రాజ్యలక్ష్మి. ఇన్నాళ్ళూ నాతో కష్టసుఖాలు పంచుకొన్నావు. నన్ను ఒంటరివాడ్ని చేసి వెళ్ళి పోయావా అంటూ బాధపడ్డాడు ప్రకాశం.

దగ్గరి బంధువులంతా వచ్చారు. రోహిణి, భర్త పిల్లలు కూడా వచ్చారు. రాత్రనగా పోయిన శవాన్ని కదిలించలేదు. చంద్రం గదిలో కొచ్చి భార్యను పిలిచాడు. నీ మెడలో ఉన్న గొలుసు తీసివ్వు. అమ్మేసి డబ్బు తీసుకొస్తాను. ముందర ఇక్కడి కార్యక్రమాలు జరగాలన్నాడు.

చూడండి ! చచ్చిపోయన దాని కోసం నా మెడలో ఉన్న గొలుసు తీసి నేనెందుకు ఇవ్వాలి. నేనివ్వను. నేనెంతో కష్టపడి చేయించుకొన్నాను.

నీకు మళ్ళీ నిదానంగా చేయిస్తాను. ఎంతసేపని శవాన్ని ఇక్కడే ఉంచుకొంటాం. ముందు దహన సంస్కారాలు జరిపించాలి.

మీరు ఎన్నయినా చెప్పండి నేను మాత్రం ఇవ్వనంది. రోహిని అన్నయను బయటకు పిలిచి నా దగ్గర రెండువేలున్నాయి. ప్రస్తుతానికి ఇవి తీసుకొని వాడమంది. కొడుకుగా ఖర్మ చేయాల్సిన భాద్యత నాది. ఆడపిల్లవి, నీ డబ్బు తీసుకోకూడదు. వద్దమ్మా.

ప్రకాశంగారు లోపలినుంచి వచ్చారు. ఏమిటి చంద్రం ఇంకా ఆలస్యం. సూర్యాస్తమయం లోగా దహనసంస్కారాలు పూర్తిచేయాలి. ప్రాణం పోయిన కట్టెను ఇంట్లో ఎంతసేపని ఉంచుకోగలం.

డబ్బుకోసం ప్రయత్నిస్తున్నాను. అలా బయటికి వెళ్ళి అరగంటలో వచ్చేస్తానన్నాడు.

ఇపుడు మీరు బయటికెళ్ళి ఎవరిదగ్గర అప్పు చేస్తారు. చేసినా ఎలా తీర్చగలరు. మీ చెల్లెలు ఇస్తా నంటే వద్దనటం దేనికి. గొప్పలకి పోయి అప్పులు చేయటం తప్పు. మన పరిస్థితిని చూసి ఒక్కసారి ఆలోచించండి. ప్రస్తుతానికి ఆ రెండు వేలు సరిపోవు. మరో రెండువేలన్నా కావాలి అన్నాడు. బ్రతికుండగా తిండికి, మందుల ఖర్చు, చచ్చిపోయాక కూడా ఈ ఖర్చు తప్పదు. ఆర్భాటాలకు పోయి అప్పులు చేయకండి అంటూ హెచ్చరించింది కమల.

మీ అమ్మ దహనసంస్కారాల కోసం మీరేమీ అప్పుల పాలు కావద్దు. మా గురించి మీరు బాధ

పడటం దేనికి. ఎపుడో ముందు జాగ్రత్త కోసం బ్యాంకులో పదివేలు దాచాను. కాగితం మీద సంతకం పెట్టి ఇస్తాను. ఆ డబ్బుతోనే కార్యక్రమం జరిపించండి. నాకు తెలుసు మీరు డబ్బుకోసం అప్పు చేయాల్సి వస్తుందని. ముందుగానే ఏర్పాటు చేసి ఉంచాను. తీసుకోమంటూ బ్యాంక్ బుక్ తెచ్చిచ్చాడు ప్రకాశంగారు అంత దుఃఖంలో కూడా !

చూశారా ! మీ నాన్న బ్యాంకులో పదివేలు దాచుకొని మనం ఇబ్బంది పడుతున్నా లేవంటూ చూస్తూ ఊరుకొన్నారు. ఆరోజు స్థలం కొందామంటే డబ్బు లేదన్నారు నిష్ఠూరమాడింది కమల.

'మనం ఆ డబ్బుతో స్థలం కొన్నా ఇప్పుడు అమ్ముకోవలసి వచ్చేది. ఆ రోజు ఆ డబ్బు దాచబట్టే ఇవాళ ఉపయోగపడింది. నాన్న మనమంచికే చేశాడు ఇదంతా ! అప్పులు చేయకుండా బాధ తప్పించంటూ బ్యాంకు నుంచి డబ్బు డ్రా చేసు కొచ్చాక గాని తల్లికి అంత్యక్రియలు జరిపించలేక పోయాడు.

ఎలాగోలా ఒక బాధ్యత వదిలించుకొన్నాం. మీనాన్న ఇచ్చిన పదివేలు మీ అమ్మకే ఖర్చుపెట్టారు. మరి మీ నాన్ననేం చేస్తారు. అపుడు కూడా నా మెడలో గొలుసు అడుగుతారా. ఇద్దరాడపిల్లలున్నారు. వాళ్లకోసం ఒకపైసా దాచలేదు. మిమ్మల్ని కట్టుకొని ఏం సుఖపడుతున్నాను. ఎప్పుడూ అనుకోని ఖర్చులు అవాంతరాలుగా వచ్చి పడుతున్నాయి. దేనికైనా పెట్టి పుట్టాలి. ఒక ఇల్లులేదు వాకిలి లేదు. మంచి ఉద్యోగం అంతకన్నా లేదు. నామొహాన ఇంతే రాసి పెట్టి ఉంది.

భార్య మాటలకు ఎదురు జవాబు చెప్పటం చేతకాక చంద్రం బయటికెళ్ళాడు. చూశావా ! రాజ్యం! ఈ బంధాలన్నీ తెంచుకొని దూరంగా వెళ్ళిపోయావు. నువ్వు చాలా అదృష్టవంతురాలివి. నేను మాత్రం ప్రాణం లేని కట్టెగా మిగిలాను. ఇంట్లో వాళ్లకి ఎంతోకాలం నా బరువు బాధ్యతలుండకూడదు. త్వరలోనేనిన్ను చేరుకొంటాను ! నా కోసం నువ్వక్కడ ఎదురు చూస్తుంటావని తెలుసు !

"నాన్న ఎలా ఉన్నాడో అక్కడ ! వెళ్ళి పదిహేనురోజులైంది. ఇంకా రాలేదన్నాడు చంద్రం. అక్కడ ఉంటే మీకే నష్టంలేదు. ఇక్కడ కొచ్చి మాత్రం ఏం చేస్తారు. రోజుకో రకం వండి పెడుతుంటే మీ చెల్లెలు తిని కూర్చుంటాడు.

ఎంతయినా ఇంటికి పెద్దదిక్కు. ఆయన లేకపోతే ఇల్లంతా వెలితిగా ఉందని బాధపడ్డాడు. కమలకు మాత్రం ప్రాణం హాయిగా ఉంది.

చంద్రం గారిల్లు ఇదేనా అంటూ వచ్చాడు ఓ వ్యక్తి. అవును!నేను చంద్రాన్ని. ఏం కావాలన్నాడు.

ప్రకాశంగారు మీకేమవుతారు... ఆయన మా నాన్నగారు.

అయాం సారీ. ఆయన జేబులో ఈ అడ్రస్ వుంటే వెతుక్కుంటూ వచ్చాం. ఫోన్ నెంబరు కనిపించలేదు. మూడురోజులుగా కుంభవృష్టిలా కురుస్తున్న వర్షాలకి వాగులన్నీ పొంగుతున్నాయి. మీ నాన్నగారు ప్రయాణం చేస్తున్న బస్సు వాగులో పడిపోయింది. మరో పదిమందిదాకా చనిపోయి ఉంటారు. మీకీ విషయం తెలియచేద్దామని వచ్చాను. మీ నాన్నగారు నాకు బాగా తెలిసినాయన. అందుకే వెతుక్కొంటూ వచ్చానన్నాడు.

ఆఁ అలాగా. మా నాన్నగారు చనిపోయారా పదండి వెళదామంటూ వెనక్కి తిరిగి చూడకుండా వచ్చిన వ్యక్తితో బయలుదేరాడు చంద్రం. వాగుపక్కనే పడి ఉన్న శవాలు. వరుసగా పడుకోబెట్టారు. క్రేన్‌లతో బస్‌ని బయటికి తీస్తున్నారు. చనిపోయిన వారికోసం వచ్చిన బంధువులంతా గుండెలు బాదుకొంటూ శోకాలు పెడుతున్నారు. ఎమ్మార్వోలు, మినిష్టర్లు వచ్చారు. మీడియా వాళ్ళు అప్పటికే చేరుకొన్నారు. ఇలా జరగటం దురదృష్టకరం. చనిపోయినవారికి ప్రభుత్వం లక్షరూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇస్తుందని ప్రకటించారు. దహన సంస్కారాల కోసం తలా పదివేలు ఇచ్చారు.

చూశావా ! కమలా ! నాన్న ఎంత పని చేశాడో. తను చనిపోయాక కర్మకాండలకు మనం డబ్బుకోసం ఎక్కడ ఇబ్బంది పడతామోనని తన ఖర్చుల కోసం తనే డబ్బు సంపాదించుకొన్నాడు. మనం అప్పు చేయటం ఇష్టం లేకపోయింది. ఆయన పోతూపోతూ మనకి ఎంత సహాయం చేశాడో చూశావా. నాలాంటికొడుకు అసమర్థుడుగా పుట్టి నందుకు నాకు మంచి చేసి పోయాడు. బస్సు ప్రమాదంలో చనిపోయినందుకు ఇచ్చిన ఎక్స్ గ్రేషియా ఆయన ఖర్చులకోసం ఉపయోగించు కొంటున్నాడు. ఇలాంటి తండ్రి కడుపున పుట్టి నందుకు నేను చాలా అదృష్టవంతుడినంటూ పిచ్చివాడిలా నవ్వుకొన్నాడు చంద్రం !

## గజల్ వాగ్గేయకారుడు డా॥ అద్దేపల్లి

5-1-2008 సా॥ 6గం॥లకు హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం ఎన్.టి.ఆర్. ఆడిటోరియంలో డా॥ అద్దేపల్లి రామమోహనరావు, తాను రచించి , స్వరపరచి, గానం చేసిన "అద్దేపల్లి తెలుగు గజల్" ఆడియో సి.డి.ని పద్మభూషణ్, జ్ఞానపీఠపురస్కార గ్రహీత డా॥ సి.నారాయణరెడ్డి ఆవిష్కరించారు. తన ముఖ్యఅతిథి ప్రసంగంలో, అద్దేపల్లి ప్రత్యేక ముద్ర కలిగిన కవిగా, విమర్శకుడుగా, వక్తగా సుప్రసిద్ధుడనీ, ఈ రోజు వాగ్గేయకారునిగా కూడా అవతరించారనీ పేర్కొన్నారు. దాశరథి, కాళోజీ, వానామలై తాను గజల్స్ వ్రాశామని, ఇప్పుడు అద్దేపల్లి తానే రాసి, తానే గజల్‌కి కావలసిన ఆవేదనతో పాడారని, అద్దేపల్లికి ఏ ప్రక్రియలోనైనా తన మార్గం తనకుందని, అదే 'ప్రగతి శీలత' అని చెప్పారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన డా॥ వెలిచాల కొండలరావు, గజల్ సంస్కృతి గూర్చి వివరించి, అద్దేపల్లి గజల్‌లోని కవిత్వాన్ని, స్వర ఆవిష్కరణలను శ్లాఘించారు. ఆత్మీయ అతిథి, ఐ.ఏ.ఎస్. అధికారి జి. ఫణికుమార్, అద్దేపల్లి వ్రాసిన 'మనిషి' అనే గజల్‌లోని తాత్వికత గూర్చి వివరిస్తూ, అద్దేపల్లి నిత్య చైతన్యమూర్తి అని అభివర్ణించారు. సభకు



అధ్యక్షత వహించిన ప్రముఖ విమర్శకులు డా॥ నోముల సత్యనారాయణ అద్దేపల్లి గానయోగ్యంగా గజల్‌ని వ్రాసిన తీరును ప్రశంసించారు. డా॥అద్దేపల్లి తన స్పందనలో, గులామ్ అలా పాడిన గజల్లు తనకు గొప్ప ప్రేరణను కల్గించాయని, గజల్ వ్రాసి పాడడానికి ప్రోత్సాహమిచ్చాయని చెప్పారు. సభ్యుల కోరికపై "ఈ ధనమంత పోనీ" అనే గజల్‌ను గొప్ప ఆర్ద్రతతో పాడి, అందరినీ ఒక సమాధిస్థితిలోనికి తీసుకొని వెళ్ళారు. ఆవిష్కరణ సభను ఏర్పాటు చేసిన "తంగిరాల మెమోరియల్ ట్రస్టు" వారు అద్దేపల్లిని ఘనంగా సత్కరించారు. సభకు స్వాగతం, వందన సమర్పణ తంగిరాల చక్రవర్తి చేసారు.